
# టార్గెట్ పొంగులేటి!

- రేవంత్‌కు, మంత్రికి మధ్య గ్యాప్?
- నెక్స్ట్ సీఎం ఆయనేనన్న ప్రచారం
- పార్టీ ఫిరాయింపుల్లో కీలక పాత్ర
- ప్రభుత్వంలో పొంగులేటి ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాలు!
- ఇమేజ్ డ్యామేజ్ చేసేలా ఎత్తులు
- రాజకీయంగా ఇరుకున పెట్టే చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): సొంత పార్టీలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టార్గెట్ అయ్యారా? సొంత ప్రభుత్వంలోనే ఆయన ప్రాధాన్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయా? రాజకీయంగా ఇరుకునపెట్టేలా, ఆయన ఇమేజ్ డ్యామేజ్ చేసేలా కొందరు ఎత్తులు వేస్తున్నారా? అంటే పలు సంఘటనలు అవును! అన్న ప్రచారానికి ఊతమిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలవబోతున్నదో తొడగొట్టి సవాల్ చేసి చెప్పిన రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉక్కపోతకు గురవుతున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. పైకి అంతా బాగానే కనిపించినా ప్రభుత్వంలో ఆయన ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు వదంతులు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నోటితో నవ్వి నొసటితో వెక్కిరిస్తున్న పరిస్థితులను ఆయన గమనిస్తున్నా.. ఇటు ఆస్వాదించలేక, అటు అడ్డుకోలేక అంతర్మథనం చెందుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రజా పనులకు అట్టహాసంగా ఆదేశాలిస్తున్నా అవి పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.

### తొలినాళ్లలో అంతా ఆయనదే అన్నట్టు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి కొద్దినెలల ముందు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. పార్టీలో కీలక నేతగా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయనకు అత్యంత కీలకమైన రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖలను కట్టబెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అంతా ఆయనదే నడిచినట్టు, ఆయన మాటే శిరోధార్యం అన్నట్టుగా కనిపించినా ప్రస్తుతం ఆ పరిస్థితులు మాయమైతున్నట్టు పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. రాజకీయాల్లో ఒంటరిగా 2014లో రంగప్రవేశం చేసిన పొంగులేటి.. క్రమేణా తన బలాన్ని, బలగాన్ని పెంచుకునే ప్రయత్నం చేయటం, కీలకమైన వ్యక్తిగా, శక్తిగా ఎదిగేలా తన వ్యవహారశైలి ఉండటంతో ఆయన వేగానికి కళ్లెం వేసేలా ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను తన సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి ఇవ్వాలని ఢిల్లీ స్థాయిలో ఆయన భారీ ప్రయత్నాలు చేశారు. ఒక దశలో ఆయనకే టికెట్ ఖరారు అయిందన్న ప్రచారం సైతం జరిగింది. ఢిల్లీలో చక్రం తిప్పగలిగే ఆయన శక్తిని గమనించిన పార్టీ ప్రభుత్వ పెద్దలు.. రాజకీయంగా మరింత బలోపేతం కాకుండా చక్రం తిప్పి పొంగులేటి ప్రసాద్‌రెడ్డికి కాకుండా పొంగులేటి వియ్యంకుడు రామసాయం రఘురాంరెడ్డికి టికెట్ వచ్చేలా చేశారని అప్పట్లో భారీగా ప్రచారం జరిగింది. పొంగులేటిని ప్రభుత్వ వ్యవహారాలకే పరిమితం చేయాలన్న లక్ష్యంతో ఆయనకు లభించే అవకాశాలను అడుగడుగునా అడ్డుకుంటున్నట్టు చర్చ జరుగుతున్నది. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడి నియామకంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరుల అభిప్రాయాలను పార్టీ అధిష్ఠానం తెలుసుకున్నది. పొంగులేటికీ ఢిల్లీ నుంచి పిలుపు వస్తుందని ఆయన అనుచరులు భావించినా, కొందరు పార్టీ పెద్దలు, ప్రభుత్వ పెద్దలు ఆ పిలుపు అందకుండా చేశారన్న విమర్శలు పార్టీలో వెల్లువెత్తుతున్నాయి.



## వెంటాడుతున్న వరుస వివాదాలు

**మంత్రిగా బాధ్యతలు** స్వీకరించాక పలుసార్లు వివాదాస్పద సంఘటనల ద్వారా పొంగులేటి వార్తల్లో నిలిచారు. అత్యంత ఖరీదైన విదేశీ వాచీలను తన కుమారుడు కొనుగోలు వ్యవహారం వివాదాస్పదమైంది. దీనిపై ఆయన ప్రభుత్వ పెద్దలకు వివరణ ఇచ్చుకున్నట్టు ప్రచారం. అది మర్చిపోకముందే తన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నుంచి చేసే కాంట్రాక్టు పనులకు విదేశీ బ్యాంకులు బ్యాంకు గ్యారంటీ ఇవ్వడం మంత్రిని మరోసారి వార్తల్లో నిలిపింది. ఈ ఘటనలు స్వతహాగా జరిగినవి కావని, పొంగులేటి ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేందుకు పార్టీలోని, ప్రభుత్వంలోని కొందరు ఇబ్బంది పెడుతున్నారని ఆయన అనుచరవర్గంలో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వారి సందేహాలకు బలం చేకూర్చేలా హైదరాబాద్‌లోని హిమాయత్‌సాగర్‌లో సొంతింటి నిర్మాణంపై ఆరోపణలు రావడం.. హైడ్రా వాటిపై దృష్టి సాధించాలని పెద్దఎత్తున డిమాండ్లు తలెత్తడంతో ఈ వ్యవహారంపై స్వయంగా పొంగులేటి మీడియాతో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితికి ప్రభుత్వంలోని కొందరి అదృశ్య హస్తమే కారణమన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. పొంగులేటి ఇంటిపై విమర్శలు రాగానే.. అక్రమ నిర్మాణాలు ఎవరు చేసినా సహించేది లేదని, హైడ్రా తన పని తాను చేసుకుపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పైగా, సీఎం సోదరుడు నిర్మించుకున్న ఇంటిపై ఆరోపణలు రావడంతో అధికారులు తక్షణం స్పందించి నోటీసులు జారీ చేయడం వంటి చర్యలు పొంగులేటిని రాజకీయంగా ఇరుకునపెట్టడానికేనన్న అభిప్రాయం కాంగ్రెస్ పెద్దల్లో వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం జరుగుతున్నట్టు వారిలో చర్చ జరుగుతున్నది. తన జిల్లా, తన నియోజకవర్గానికి సంబంధించి ప్రజా పనులు చేయాలని కొంతమంది మంత్రులకు ఆయన ఫైళ్లు పంపి నెలలు గడుస్తున్నా వాటికి మోక్షం కలగడం లేదని ప్రచారం జరుగుతున్నది. సమాచార మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని సూర్యాపేట నుంచి ఖమ్మం తరలించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై శాఖ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. ఆ ఫైల్ ఇప్పటికీ క్లియర్ కాకపోవటాన్ని ఉదహరిస్తున్నారు. మరోవైపు సమీక్షల్లో పొంగులేటి వాడే పరుష పదజాలాన్ని అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్టు ప్రచారం. చిన్నబుచ్చుకొనే వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ పట్టణ ఆరోగ్య కేంద్రంలోకి వర్షపు నీరు చేరడంతో బయటకు వస్తున్న వైద్య సిబ్బంది



సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపల్ కార్యాలయంలోకి చేరిన వర్షపు నీటిలో తడిసిన ఫైళ్లు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో మత్తడి పోస్తున్న అమ్మాపురం చెరువు



శ్రీశైలం మార్గంలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద గుట్టపై నుంచి జాలువారుతున్న జలధార. (ఇన్‌సెట్‌లో) నీట మునిగిన ఉమామహేశ్వర ఆలయం

# తెలంగాణకు రెడ్ అలెర్ట్

## మరో 2 రోజులు భారీ వర్షాలు

**వనపర్తిలో ఇల్లుపైకప్పు కూలి ఒకరు.. ములుగులో పిడుగుపాటుకు మరొకరు మృతి**

హైదరాబాద్, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ): అరేబియా సముద్రంలో అస్నా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో రాగల రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం వరకు ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని దీంతో రాష్ట్రానికి రెడ్ అలర్ట్ ప్రకటించినట్టు వాతావరణ శాఖ సంచాలకులు నాగరత్న శనివారం తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, వరంగల్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని నాగరత్న తెలిపారు. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశామని, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. భారీ వర్ష సూచన ఉన్న కారణంగా ప్రజలు అవసరమైతేనే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలతో ఇండ్లలోకి నీరు చేరింది. రహదారులు చెరువులను తలపించాయి. కరీంనగర్‌లో శనివారం కురిసిన భారీ వర్షానికి 150 సంవత్సరాల పురాతన పాండురంగ దేవాలయం పైకప్పు కూలిపోయింది. శిథిలావస్థకు చేరిన ఈ ఆలయం స్లాబ్ పైకప్పు, గోడలు విరిగి పడ్డాయి. డిప్యూటి మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ ఆలయాన్ని పరిశీలించి, శిథిలాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. నల్లగొండలోని పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లోకి వర్షపు నీరు చేరి రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. త్రిపురారం మండలం బాబుసాయిపేట వద్ద కొత్త వంతెన నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద తాకిడికి కొట్టుకుపోయింది. భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే ఓసీ-2, 3 గనుల్లో వరద నీరు చేరి బురదయమై బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దీంతో సింగరేణి సంస్థకు దాదాపు రూ.కోటి మేర నష్టం వాటిల్లినట్టు సింగరేణి అధికారులు తెలిపారు.

### విజయవాడకు వెళ్లే వాహనాల దారి మళ్లింపు

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను భారీ వర్షాల నేపథ్యంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి వద్ద గుంటూరు మీదుగా దారి మళ్లిస్తున్నట్టు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఏపీలోని జగ్గయ్యపేట వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవహిస్తున్నందున వాహనాలను నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి మీదుగా మిర్యాలగూడ, వాడపల్లి, గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను సూర్యాపేట సమీపంలోని రాయినిగుడెం వద్ద ఖమ్మం బైపాస్ మీదుగా మళ్లిస్తున్నారు. వాహనదారులు ఖమ్మం, సత్తుపల్లి మీదుగా రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లొచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

### పిడుగుపాటుకు ఒకరు.. ఇల్లు కూలి మరొకరు..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపురం గ్రామంలో బర్లను మేపేందుకు వెళ్లిన పుట్ట రమేశ్ కుమారుడు మహేశ్ (18)పై శనివారం పిడిగుపడి మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన గైని స్వాతి (18) తన చిన్నాన్న ఇంటికి వెళ్లింది. అప్పటికే పిడుగుపడి విద్యుత్ వైర్ తెగడంతో ఆ ఇల్లంతా కరెంట్ సరఫరా అయి స్వాతి డోర్ తీస్తుండగా, షాక్ తగిలి మృతి చెందింది. బొప్పాస్‌పల్లిలో పిడుగుపడి గాయపడిన చవాన్ చిమ్యా నాయక్ (65)ను బాన్సువాడ దవాఖానకు తరలించారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో ఇంటిపైకప్పు కూలడంతో వడ్డె చంద్రయ్య (65) మృతి చెందాడు.



నారాయణపేట జిల్లా అభంగాపూర్ శివారులో ఉధృతంగా పారుతున్న వాగును దాటుతున్న జనం

### రెస్క్యూకు 24 బోట్లతో సిద్ధం

భారీ వర్షాల్లో బాధితులను రక్షించేందుకు అగ్నిమాపకశాఖలోని స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ 50 మంది సిబ్బందిని 24 రెస్క్యూ బోట్లతో సంసిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్‌లో బోట్స్‌తో పాటు నీటిని తోడే పంప్స్, లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు ఇతర రెస్క్యూ సామగ్రితో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వరద ప్రభావిత జిల్లాల కోసం అత్యవసరమైతే ప్రత్యేక బృందాలను పంపుతామని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 'ఆపద మిత్ర' పేరుతో వలంటీర్లను సిద్ధం చేస్తున్నామని నాగిరెడ్డి వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 109 మంది ఆపద మిత్రలను సిద్ధం చేశామని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో వీరి ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలకు బోట్లు నడిపేందుకు అగ్నిమాపకశాఖలోనే 145 మంది ఫైర్‌మెన్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు వరద

**ఒక్కరోజులోనే 4.10 లక్షల క్యూసెక్కులు.. మూసీ, సాగర్ గేట్లు ఎత్తి నీటి విడుదల**

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): ఎగువన భారీ వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు శనివారం ఒక్కరోజే 4.10 లక్షల క్యూసెక్కుల వరద చేరింది. గడిచిన పదేండ్లలో ఒక్క రోజులో ఇంతటి ప్రవాహం రావడం ఇదే తొలిసారి అని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కృష్ణాతోపాటు గోదావరి నదిలోనూ ఇన్‌ఫ్లోలు ఒక్కసారిగా పెరిగాయి. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగానూ ప్రస్తుతం 588.90 అడుగులు ఉన్నది. శనివారం 26గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా వరద చేరింది.

### కృష్ణమ్మ ఉగ్రరూపం

కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ వరద వస్తున్నది. శనివారం జూరాల ప్రాజెక్టుకు 3.36 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది.

### మేడిగడ్డకు 1.40లక్షల క్యూసెక్కుల నీరు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌కు 1.40 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. మొత్తం 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. అన్నారం బరాజ్‌కు మానేరు, చిన్న చిన్న కాలువల ద్వారా 3,800 క్యూసెక్కుల నీరును వస్తుండగా, మొత్తం 66 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.

### కాళేశ్వరం వద్ద నిలకడగా గోదావరి

మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా పారుతున్నది. పుష్కర ఘాట్ వద్ద గోదావరి ప్రాణహితతో కలిసి 1.40 లక్షల క్యూసెక్కులుగా 5.67 మీటర్ల ఎత్తులో పారుతూ మేడిగడ్డ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం మళ్లీ పెరుగుతున్నది.

### ఏపీలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ మొగల్రాజపురంలో సున్నపుబట్టి సెంటర్ వద్ద కొండచరియలు విరిగిపడి నలుగురుప్రాణాలు కోల్పోయారు.



సాగర్ జలాశయం నుంచి 26 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

## అప్రమత్తంగా ఉండండి

- తక్షణ సహాయ చర్యలు చేపట్టండి
- లోతట్టు ప్రాంతాల ప్రజల్ని తరలించండి
- సీఎస్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు
- కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు
- కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన సీఎస్ శాంతికుమారితో మాట్లాడుతూ...రెవెన్యూ,మున్సిపల్, విద్యుత్తు, వైద్యారోగ్య శాఖాధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏ విధమైన ప్రాణ, ఆస్తినష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ప్రతీ కలెక్టరేట్‌తోపాటు జీహెచ్‌ఎంసీ, సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్‌లను తెరవాలని చెప్పారు. వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకం గా నియమించాలని చెప్పారు. పాఠశాలలకు సెలవుదినంగా ప్రకటించుకొనే నిర్ణయం కలెక్టర్లు తీసుకోవాలని స్పష్టంచేశారు. వరద ప్రాంతాల్లో పునరావాస శిబిరాలను ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### అధికారులు సెలవులు పెట్టొద్దు

భారత వాతావరణశాఖ రెడ్‌అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో నీటిపారుదల శాఖాధికారులు సెలవులు పెట్టొద్దని,అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వదిలివెళ్లొద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఆదేశాలు జారీచేశారు. రిజర్వాయర్లు, చెరువుల నీటి స్థాయిలను పర్యవేక్షించాలని సూచించారు. ఓవర్‌ఫ్లోను నిరోధించడానికి గేట్లు, స్పిల్‌వేల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. డ్యామ్‌లు కట్టలు, కాలువను తనిఖీ చేయాలని ఆదేశించారు.

### వైద్య సిబ్బందికీ ..

వర్షాలు తగ్గే వరకు వైద్యులకు, సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని, డాక్టర్లతోపాటు సిబ్బంది అంతా విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అంబులెన్స్ సర్వీసులు, ఔషధాలు, టెస్టింగ్ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గర్భిణులను హాస్పిటళ్లకు తరలించి, వెయిటింగ్ రూమ్స్ కేటాయించాలని ఆదేశించారు. దోమల బెడదను నివారించేందుకు పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖల సహకారం తీసుకోవాలని సూచించారు.

# పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యే

- గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హనుమంతు



గద్వాల/గద్వాల అర్బన్, ఆగస్టు 31 : గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికలో నెలకొన్న లొల్లి ముగిసింది. పాలక మండలిని ఎమ్మెల్యే వర్గానికే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గిరిని కేటీదొడ్డి మండలానికి చెందిన కుర్వ హనుమంత్‌కు కేటాయించగా.. వైస్ చైర్మన్‌గా గంగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్లుగా చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి ఆంజనేయులు, తెలుగు నర్సింహులు, తిరుపతి, విశ్వగయన్ ఆచారి, లలితమ్మ, నర్సింహారాజ్, కల్యాణం సోమన్న, శాంతమ్మ, బజారి, షేక్ షాహిన్‌బాన్, రామయ్యపాటు పలువురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవి కోసం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత.. కాంగ్రెస్ పెద్దలతో తీవ్రస్థాయిలో మంతనాలు జరిపారు. చివరకు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వైపే పార్టీ పెద్దలు మొగ్గుచూపారు. దీంతో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ప్రతిష్ఠ పార్టీలో మసకబారినట్టు పలువురు చర్చించుకుంటున్నారు.

# బిగ్ టీవీ రిపోర్టర్ దౌర్జన్యం

- నెలకు 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- సీఎం తమ్ముడి మనిషినని బెదిరింపు
- జేపీ దర్గా నిర్వాహకులపై దాడి
- ఫిర్యాదు చేసిన బాధితులు

కొత్తూరు, ఆగస్టు 31: 'నేను సీఎం తమ్ముడి మనిషిని. నా వర్గం వారికి నెలకు రూ.5 లక్షలు ఇవ్వాలి. లేకుంటే జేపీ దర్గా నిర్వహణ కాంట్రాక్ట్‌ను రద్దు చేయిస్తా' అంటూ బిగ్ టీవీ రిపోర్టర్ దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం జేపీ దర్గా నిర్వాహకులు వాపోయారు. తనకు డబ్బులివ్వలేదని శుక్రవారం రాత్రి తమపై దాడి చేశాడని బాధితులు కొత్తూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. ఈ మేరకు కొత్తూరు సీఐ నరసింహారావు వివరాలు వెల్లడించారు. జేపీ దర్గాలో నిర్వహణ కాంట్రాక్ట్ దక్కించుకున్న ఖాజా పాషా వద్ద.. సయ్యద్ రఫీక్‌కు చెందిన 9 మంది సబ్ కాంట్రాక్టర్లు నిర్వహణ పనులు చేస్తున్నారు. బిగ్ టీవీ రిపోర్టర్ ఫయాజ్ మునావర్ తన వర్గం వారికి నెలకు రూ.5 లక్షలు ఇవ్వాలని, లేకపోతే నిర్వహణ పనులు చేసుకోనివ్వనని బెదిరిస్తూ కొన్ని రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బొమ్మల దుకాణం వద్ద ఫయాజ్ వర్గం వారు కట్టెలు, హోటల్‌లోని గరిటెలతో రఫీక్ వర్గీయులపై దాడి చేశారు. ఈ దాడిలో రఫీక్ వర్గీయులు గాయపడ్డారు. రఫీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే.. ఫయాజ్ మామ నౌకత్, నవాజ్ తదితరులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా.. బిగ్ టీవీ రిపోర్టర్ ఫయాజ్ మునావర్ సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి మనిషినంటూ దర్గాలో భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బాధితుడు రఫీక్ మీడియా ముందు వాపోయాడు. కొత్తూరు పోలీస్ స్టేషన్ మొత్తం తమ కంట్రోల్‌లో ఉందని, ఫిర్యాదు చేసినా తమను ఎవరూ ఏం చేయలేరని, డబ్బులు ఇవ్వాల్సిందేనని ఫయాజ్ బెదిరిస్తున్నాడని చెప్పారు. ఫయాజ్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రఫీక్ మీడియా ముందు విలపించాడు.



షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖాన వద్ద బిగ్ టీవీ రిపోర్టర్ ఫయాజ్ దౌర్జన్యం గురించి మీడియాతో మాట్లాడుతున్న రఫీక్